సొంతింటి కల నెరవేరేదెన్నడో..?



58వ వార్డు ములగాడలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయం

- 58, 62 వార్డుల్లో టిడ్కో గృహ సముదాయాల నిర్మాణం
- అర్హులకు నేటికీ మంజూరు కాని ఇళ్లు
- ఎన్నికల హామీ నిలబెట్టుకోని కూటమి పాలకులు
- ఆశగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులు



62వ వార్డు అచ్చినాయుడు లోవలో నిర్మించిన టిడ్కో ఇళ్లు

మల్కాపురం: నియోజకవర్గంలోని పలువురు పేదలు ప్రభుత్వం అందించే టిడ్కో గృహాల కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి 16 నెలలు కావస్తున్నా.. పేదవాడి సొంతింటి కల నేటికీ నెరవేరలేదు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్మాణంలో ఉన్న గృహాలను అర్హులందరికీ ఇస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు ప్రజలను నమ్మబలికారు. తీరా అధికారంలోకి వచ్చాక ఇళ్లపై ఎక్కడ ప్రజలు ప్రశ్నిస్తారో అని తప్పించుకు తిరుగుతున్నారు.

సిద్ధంగా టిడ్కో గృహ సముదాయాలు

జీవీఎంసీ 58వ వార్డు ములగాడలో 336 టిడ్కో గృహ సముదాయాలు పూర్తయ్యాయి. గతేడాది ఎన్నికల ముందు అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులైన వారికి టిడ్కో ఇళ్లు కేటాయించగా.. చాలా మంది గృహ ప్రవేశాలు కూడా చేశారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో నాడు ఇళ్లు పొందిన వారిలో కొందరు అనర్హులని కూటమి పాలకులు చెప్పడంతో ఆ గృహ సముదాయాలు మంజూరుకు నోచుకోకుండా నేటికీ అలాగే ఉండిపోయాయి.

వివిధ కారణాలతో దక్కని ఇళ్లు

62వ వార్డు అచ్చినాయుడులోవ కొండ ప్రాంతంలో సుమారు 4 వేల టిడ్కో గృహ సముదాయాలు నిర్మించారు. వీటిలో సుమారు 2 వేల మంది వరకు నాటి ప్రభుత్వం ఇంటి తాళాలు అందించగా.. వారు గృహ ప్రవేశాలు కూడా చేసుకున్నారు. మిగిలిన ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల పత్రాల్లో మార్పులు – చేర్పులు, బయోమెట్రిక్ మిషన్‌లో వారి వేలు ముద్రలు సరిగ్గా సరిపడకపోవడం ఇలా పలు కారణాల వల్ల ఇళ్లు దక్కలేదు. గత ఎన్నికల్లో కూటమి నాయకులు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన వారికి ఇళ్లు ఇస్తామని గట్టిగా ప్రచారాలు జరిపారు. 16 నెలలు గడిచినా నేటికీ ఆ హామీని నిలబెట్టుకోకపోవడంతో అర్హులు ఆవేదన, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తి కాని పనులు

జీవీఎంసీ 58, 62 వార్డుల్లో చేపట్టిన టిడ్కో గృహాల నిర్మాణాల వద్ద ప్లంబింగ్, ఎలక్ట్రికల్, రోడ్డు ఏర్పాటు పనులు జరగాల్సి ఉంది. ఇవి పూర్తి కావాలంటే మరో ఆరు నెలల సమయం కచ్చితంగా పడుతుంది. ఇటు చూస్తే కూటమి నాయకులు 2026 సంక్రాంతి నాటికి అర్హులైన పేదలకు ఇళ్లు ఇస్తామంటున్నారు. ఇది సాధ్యమయ్యే పనేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు సొంతింటి కల నెరవేరే రోజు కోసం లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

అర్హులకు ఇళ్లు అందించాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన వారికి ములగాడ, అచ్చినాయుడులోవ ప్రాంతాల వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లు కేటాయించారు. చాలా రోజులు గడుస్తున్నా.. నేటికీ వారు ఆ ఇళ్లలో ఉండలేని పరిస్థితి. కూటమి పాలకులు చొరవ చూపి అర్హులకు గృహాలు అందించేలా చర్యలు తీసుకోవాలి.

– రేవళ్ల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ 59వ వార్డు అధ్యక్షుడు

సొంతింటి కల నెరవేర్చాలి



పేదల సొంతింటి కల ఈ ఏడాదైనా నెరవేరుతుందో.. లేదో అన్న ఆందోళనలో అర్హులైన లబ్ధిదారులు ఉన్నారు. అర్హులకు ఇళ్ల తాళాలు అందించినా.. వారు ఆ ఇంట్లో నివాసం ఉండలేని పరిస్థితి కలగడం బాధాకరం. ఈ సమస్యపై కూటమి పాలకులు స్పందించి లబ్ధిదారులకు న్యాయం చేయాలి.

– బాలు మహేంద్ర, మల్కాపురం

క్లుప్తంగా

కాలుష్య సమస్యకు మొక్కలతో చెక్



స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంతోపాటు నగర వాసులను కాలుష్య సమస్య పట్టి పీడిస్తోందని, విరివిగా మొక్కలు నాటడమే దీనికి పరిష్కారమని 58వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ అన్నారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం వార్డులోని గుల్లలపాలెంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తమ ఇంటి వద్ద ఒక్క మొక్క నాటితే ప్రాణ రక్షణకు అవసరమైన ఆక్సిజన్ వాయువును పొందవచ్చన్నారు. ఇళ్ల వద్ద వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా పారిశుద్ధ్య వాహనాలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, సచివాలయం శానిటరీ సిబ్బంది, మలేరియా విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.లక్ష విలువైన బాణసంచా పట్టివేత



ఇంట్లో నిల్వ చేసిన బాణసంచా సామగ్రిని బయటకు తీస్తున్న పోలీసులు

మల్కాపురం: అనధికారికంగా బాణసంచా సామగ్రి నిల్వ చేసిన వారి ఇంటిపై పోలీసులు శనివారం ఉదయం దాడి చేశారు. సుమారు రూ.లక్ష విలులైన సామగ్రిని పట్టుకున్నారు. వివరాలిలా.. 61వ వార్డు మల్కాపురం మార్కెట్ వీధి వద్ద లక్ష్మి అనే మహిళ ఇంట్లో దీపావళి బాణసంచా సామగ్రి ఉందని పోలీసులకు సమాచారం అందింది. ఆ ఇంటిపై ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు సిబ్బందితో కలిసి వెళ్లి దాడి చేశారు. ఆమె ఇంట్లో సుమారు రూ.లక్ష విలువ గల మందుగుండు సామగ్రిని గుర్తించి, స్వాధీనం పరుచుకుని కేసు నమోదు చేశారు.

బోరు ఏర్పాటుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ బొమ్మిడి రమణ

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఎస్సీ కాలనీలో మంచినీటి బోరు నిర్మాణానికి శనివారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. స్థానికులు మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతుండటంతో ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు జీవీఎంసీ నిధులతో బోరు ఏర్పాటు చేస్తున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో వాటర్ సప్లై డీఈ వీరయ్య, ఏఈ గోవింద్, నాయకులు వై.కిషోర్, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

‘సెయింట్ జోసెఫ్’లో తిజారా ఫెస్ట్ సందడి



ఫెస్ట్‌లో అతిథులు, అధ్యాపకులతో విద్యార్థినులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో కామర్స్–మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎన్. జ్యోతి ఆధ్వర్యంలో తిజారా ఫెస్ట్–2025 వేడుకలు జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి వేడుకలను ప్రారంభించారు. స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ నిపుణులు విద్యార్థులకు ఆర్థిక రంగం, మార్కెట్లపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కెప్టెన్ కె.సుజాత విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎం.జగదీష్‌కుమార్, ఆర్. పావని, కె.ప్రత్యూష, డాక్టర్ కె.రజని, డాక్టర్ దివ్య జోసెఫ్ పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో స్థానికులకే ప్రాధాన్యమివ్వాలి



సమావేశమైన కుల సంఘాల నాయకులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగులకు అధిక ఉపాధి అవకాశాలు కల్పించాలని 61వ వార్డు మల్కాపురానికి చెందిన పలు కులాల సంఘాల ప్రతినిధులు, ట్రేడ్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. హెచ్‌పీసీఎల్, షిప్‌యార్డ్ తదితర పరిశ్రమల్లో స్థానికేతరులకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై స్పందిస్తూ వీరంతా శనివారం మల్కాపురం గొల్ల వీధి వద్ద సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు కులాల సంఘ నాయకులు, ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్, ఐవోసీ తదితర పరిశ్రమలకు అవసరమైన భూములను తమ గ్రామంలో ప్రజలే ఇచ్చారని తెలిపారు.

ఆయా పరిశ్రమల్లో స్థానికులకు మాత్రం ఉపాధి అవకాశాలు లేవన్నారు. తమ గ్రామంలో చాలా మంది నిరుద్యోగులకు సాంకేతిక పరంగా, ఉన్నత విద్య పరంగా అనుభవం ఉందని, వీరిని కాదని స్థానికేతర కార్మికులకు కాంట్రాక్టర్‌లు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై తామంతా ఐక్య పోరాటం చేసి స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించుకుంటామన్నారు.

బీజేపీ నిరంకుశ విధానాలపై పోస్టర్ ఆవిష్కరణ

మల్కాపురం: రాజ్యాంగం, దళిత హక్కులపై బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తూ శనివారం కరపత్రం ఆవిష్కరించారు. దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో 61వ వార్డు మల్కాపురం గ్రామ మండలి వద్ద ఈ కార్యక్రమం జరిగింది. పోరాట సమితి ప్రతినిధి జె.వి.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి వి.ఎస్. నిర్మల్, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు జె.వి.సత్యనారాయణమూర్తి, సీపీఎం జాతీయ నాయకుడు లోకనాథం, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు తదితరులు పోస్టర్‌ను ఆవిష్కరించి, బీజేపీ నిరంకుశ విధానాలు తదితర అంశాలపై మాట్లాడారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన రవికుమార్

మల్కాపురం: ఆర్థిక ఇబ్బందుల భారం, కడుపు నొప్పి తాళ లేక ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు యాదవ్ తెలిపిన వివరాలిలా.. బిహార్ రాష్ట్రానికి చెందిన రవికుమార్(22) అనే యువకుడు 61వ వార్డు మల్కాపురం ప్రకాష్‌నగర్‌లోని గవర వీధిలో కుటుంబ సభ్యులతో కలిసి కొంత కాలంగా నివసిస్తున్నాడు. హెచ్‌పీసీఎల్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం తన గదిలోకి వెళ్లిన రవికుమార్ సీలింగ్ ఫ్యాన్ హుక్‌కు ఉరివేసుకున్నాడు. గదిలోకి వెళ్లిన రవి ఎంత సమయానికి రాకపోవడంతో తండ్రి రాజేష్‌కుమార్ తలుపు తట్టాడు. ఎంతకీ తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూడగా.. సీలింగ్ ఫ్యాన్ హుక్‌కు వేళాడుతున్న తన కుమారుడిని చూసి కేకలు వేశాడు. మిగిలిన కుటుంబ సభ్యుల సాయంతో మల్కాపురం పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. మృతుడికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, కొంత కాలం నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

షిప్‌యార్డ్ సమస్యలపై వినతి



ఎంపీ రాధాకృష్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సింధియా: షిప్‌యార్డ్‌లో నెలకొన్న పలు సమస్యలపై ఎంపీ కె.రాధాకృష్ణన్‌కు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. నగరంలోని డాబా గార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన ‘ప్రభుత్వ రంగం – సామాజిక న్యాయం’ అనే సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం లోక్‌సభ సభ్యుడు ఎంపీ రాధాకృష్ణన్‌ను షిప్‌యార్డ్ సీఐటీయూ నాయకులు కలిశారు. షిప్‌యార్డ్‌లో వర్క్ ఆర్డర్లు, ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, స్టాఫ్ అండ్ వర్కర్లను శాశ్వత పద్ధతిలో రిక్రూట్‌మెంట్ చేయాలని తదితర అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. షిప్‌యార్డ్ సీఐటీయూ అధ్యక్షుడు వి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ బి.ఎస్.ఎన్.రాజు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో కాలుష్య నియంత్రణ



స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న కృష్ణా కళాశాల అధ్యాపకులు



విమ్స్ ఆవరణలో మొక్క నాటుతున్న డైరెక్టర్ రాంబాబు, వైద్యులు

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో పలుచోట్ల ఉత్సాహంగా స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఆరిలోవ రైతు బజార్‌లో ఈవో నాయుడు, సిబ్బంది ఇక్కడ కాయగూరలు విక్రయించే రైతులతో కలిసి ఆవరణను శుభ్రం చేశారు. వారితో వినియోగదారులు కూడా చేయి కలిపారు. రైతు బజార్ ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి, చీపుర్లతో తుడిచి శుభ్రం చేశారు.

- విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విమ్స్ ఆవరణలో డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆవరణలో పలుచోట్ల మొక్కలు నాటారు. అనంతరం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ కాలుష్య నివారణ కోసం మొక్కలు నాటాలని, వాహనాల వినియోగం నియంత్రించాలని సూచించారు. వ్యక్తిగత వాహనాలకు బదులుగా ప్రజా రవాణాను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిలపాలెం : డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో అధ్యాపకులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ అనుకూల కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి సైకిళ్లు, సౌరశక్తిని ఉపయోగించాలని సూచించారు.

కోటి సంతకాల సేకరణకు మంచి స్పందన

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజల్లో వ్యతిరేకత
- సంతకాలు చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు..



మల్కాపురం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న పిలక రాము



59వ వార్డు వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రేవళ్ల సత్యనారాయణ



శాంతినగర్‌లో సంతకాలు సేకరిస్తున్న నాయకులు



ప్రజా ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు



వైద్య విద్యార్థినితో సంతకం చేయిస్తున్న కోడ ధనరాజు, నాయకులు

మల్కాపురం: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టే యత్నం చేస్తున్న కూటమి సర్కార్ నిర్ణయానికి వ్యతిరేకంగా చేపడుతున్న కోటి సంతకాల సేకరణకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేస్తున్నారు. 61వ వార్డు మల్కాపురం మెయిన్ రోడ్డు వద్ద చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్షుడు పిలక రామ్మోహన్‌రెడ్డి (పిలక రాము) మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీరు ప్రచారాలకే పరిమితం అవుతున్నారు తప్ప, పాలనపై శ్రద్ధ లేదన్నారు. ప్రభుత్వ భూములు చౌకగా బడాబాబులకు అప్పగిస్తూ, ప్రభుత్వ ఆధీనంలో నడవాల్సిన మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక చర్యలు తీసుకుంటోందన్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారని, తప్పక బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో లీగల్ సెల్ నాయకురాలు పీలా మాధవి, పార్టీ నగర నాయకులు బూస అప్పలరెడ్డి, అనంత్, శంకర్, చట్టి నూకరాజు, ఉరుకూటి మహేష్‌యాదవ్, వెంటేష్‌రెడ్డి, పిలక వరలక్ష్మి, చిన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- 59వ వార్డు నెహ్రూనగర్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ పాల్గొని ఇంటింటికీ వెళ్లి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఖాన్, అర్జున్, ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

52వ వార్డులో..

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీ కొత్తరోడ్డు పరిధిలో శాంతినగర్ వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయంలో వార్డు అధ్యక్షుడు జియ్యాని మారుతి ఆధ్వర్యంలో కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే చర్యలను సమష్టిగా అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఎస్ కృష్ణ, శ్రీదేవి వర్మ, సఖి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గోపాలపట్నంలో ఎంప్లాయిస్ – పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు పైడిరాజురెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా శనివారం పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఇంటలెక్చువల్ జిల్లా అధ్యక్షుడు దేవరకొండ మార్కండేయులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గణేష్ మిశ్రో, బి.లోకనాథం, బి.రామిరెడ్డి, రోజాకుమారి, ఎం.వీరరాఘవులు, కె.రమణ, అప్పారావు, సీహెచ్ అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

57వ వార్డులో ..

కంచరపాలెం: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ 57వ వార్డు సాకేతపురం, దుర్గాపురం ప్రాంతాల్లో ‘ కోటి సంతకాల ప్రజా ఉద్యమం’ కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. నియోజకవర్గ వలంటరీ విభాగం అధ్యక్షుడు కోడ ధనరాజు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో చేపడుతున్న కార్యక్రమాన్ని కార్యకర్తలు వినియోగించుకుని, వార్డు ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ముందుగా వైద్య విద్యార్థిని మొదటి సంతకం చేశారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం అధ్యక్షుడు గుణేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఈశ్వరరావు, అప్పలరాజు రామరెడ్డి చిన్ని, శివాజీ, మణి, కాశి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



లక్ష్మణరావు కుటుంబానికి ఆర్థిక సాయం, రేషన్ సరకులు అందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, స్నేహితులు

గోపాలపట్నం: స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచి దాతృత్వం చూపడం ప్రశంసనీయమని ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990–91 టెన్త్ బ్యాచ్‌కు చెందిన లక్ష్మణరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి కుటుంబానికి తోటి స్నేహితులు ఆర్థిక సాయం అందజేసి బాసటగా నిలిచారు. రూ.30 వేల నగదు, నెలకు సరిపడా రేషన్ సరకులను శనివారం లక్ష్మణరావు భార్య, పిల్లలకు గణబాబు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో సప్పా సూర్యనారాయణ, నూనెల శ్రీను, పీతల ఈశ్వర్, ఒమ్మి శ్రీను, వి.రమేష్, జి.నాగు, సుగుణ, దేవి, ఉమా, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తం



మర్రిపాలెం రైతుబజార్‌లో అవగాహన కల్పిస్తున్న సీఐ చంద్రమౌళి

గోపాలపట్నం: రైతుబజార్లలో దొంగతనాల జోరు ఎక్కువగా ఉండటంతో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని వెస్ట్ క్రైం సీఐ ఎం.చంద్రమౌళి సూచించారు. మర్రిపాలెం రైతుబజార్‌లో శనివారం వినియోగదారులకు, రైతులకు నేర నియంత్రణపై అవగాహన కల్పించారు. ఇటీవల దొంగల జోరు రోజురోజుకూ పెరిగిపోతున్న కారణంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విలువైన బంగారు ఆభరణాలు, డబ్బు, మనీ పర్సులు, సెల్‌ఫోన్లు దొంగల పాలుకాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో రైతుబజార్ అధికారులు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి

ఆరిలోవ: ఆనందంగా జరుపుకునే దీపావళి సందర్భంగా టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు డాక్టర్ అర్పితా రెడ్డి, డాక్టర్ నికితా దాస్ సూచించారు. హనుమంతవాక వద్ద ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో శనివారం పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. టపాసులు కాల్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలన్నారు. టపాసులు కాల్చినప్పుడు కళ్లజోడు పెట్టుకోవాలని, పిల్లలు టపాసులు కాల్చినప్పుడు పెద్దలు పర్యవేక్షించాలని, గ్యాస్ సిలిండర్లు, ఆయిల్ డబ్బాలు, మండే స్వభావమున్న పదార్థాలను దూరంగా ఉంచాలని సూచించారు. టపాసులను బహిరంగ ప్రదేశాల్లోనే కాల్చాలన్నారు. ఒకవేళ టపాసులు కాల్చుతుండగా కళ్లకు ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే అందుబాటులో ఉండే కంటి వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో అత్యవసర సేవలు అందించడానికి 7095031666, 9396712020 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

నిరాశ్రయులకు ఆశ్రయం



రెస్క్యూ చేసిన నిరాశ్రయులతో ఏయూటీడీ నిర్వాహకులు

అల్లిపురం: నవంబర్ 14, 15 తేదీల్లో జరగబోయే పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌ను దృష్టిలో పెట్టుకుని ఏయూటీడీ–జీవీఎంసీ షెల్టర్ల సిబ్బంది స్పెషల్ డ్రైవ్ ద్వారా రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో శనివారం నిరాశ్రయుల గుర్తింపు, షెల్టర్లకు తరలించే కార్యక్రమం చేపట్టారు. గుర్తు తెలియని దివ్యాంగుడు(45), సాలిపేటకు చెందిన ఎస్.దేవరాజు(66), ఎగిలిపాటి గణేష్(50), శాంతారావు(45), నిమ్మాడకు చెందిన ఒక మహిళ(55)ను రైల్వే పోలీసులతో కలిసి టీఎస్ఆర్ షెల్టర్‌లో పునరావాసం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. మానసిక స్థితి బాగోలేని మహిళకు శ్రద్ధా ఫౌండేషన్ ద్వారా వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. రెస్క్యూలో ప్రగడ వాసు, జ్యోతిర్మయి, శ్రీను, లీల, శాంతి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.